నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కోకాపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో మెయింటెన్స్ పనులు, విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున గురువారం నిర్ణయించిన సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. బాబుఖాన్ ఫీడర్, అక్షయపాత్ర ఫీడర్, గూంచహిల్స్ ఫీడర్, ఓషియన్ పార్క్ ఫీడర్, కోకాపేట ఫీడర్, ఫ్రంట్‌లైన్ బిల్డర్స్ ఫీడర్, ప్రెస్టేజ్ గార్డన్ ఎస్టేట్ ఫీడర్, పోలామి అవంతి ఫీడర్, ప్రెస్టేజ్ బెవర్లీ ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

బోనాలకు ఆహ్వానం



రాజేంద్రనగర్: ఆషాఢ మాసం బోనాల పండుగ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శివరాంపల్లి వాసులు బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివరాంపల్లివాసులు మాట్లాడుతూ... ఏటా ఆషాఢ మాసంలో శివరాంపల్లిలో బోనాల ఉత్సవాలను ఆనందోత్సాహాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. పండుగ రోజు తప్పనిసరిగా పూజ కార్యక్రమానికి హాజరవుతానని ఆమె హామీ ఇచ్చారన్నారు. నాయకులు సదాన వెంకటరెడ్డి, ఆనంద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కమిటీ సభ్యులు సన్నీరెడ్డి, సూర్య చరణ్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, హరిహరన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు దుస్తుల పంపిణీ



బండ్లగూడ: బోనాల పండుగను అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదర్షాకోట్ గ్రామంలోని అమ్మవారి దేవాలయంలో నిరంతరం సేవలు అందిస్తున్న ఆడపడుచులకు రాజేందర్‌రెడ్డి దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు.

కాళీమందిర్‌లో ఘనంగా బోనాలు



ఉత్సవాల్లో పాల్గొన్న స్వామిగౌడ్, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం బోనాల పండుగ ఉత్సావాలను ఘనంగా నిర్వహించారు. కాళీమందిర్ ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో తెలంగాణ శాసన మండలి మాజీ చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీయువకుల కేరింతలు, పోతరాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నేతలు ప్రేమ్‌గౌడ్, మద్దెల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారుల అనాసక్తి!

వివిధ కారణాలతో రద్దు చేసుకుంటున్న వైనం



శంషాబాద్ మండలంలోని కేబీ దొడ్డిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

- లిఖిత పూర్వకంగా కోరుతున్న ప్రజానీకం
- పలు ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- రూ. 5 లక్షలు సరిపోదని.. రూ. 9 లక్షలు ఇవ్వాలంటూ వినతి
- మోడల్ గ్రామంలోనూ అదే తీరు

శంషాబాద్ రూరల్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్ల' పథకంపై లబ్ధిదారుల ఆసక్తి చూపడం లేదు. మంజూరైన ఇళ్ల నిర్మాణం చేపట్టలేమని చెబుతూ.. వాటి రద్దు చేసుకుంటున్నారు. ఈ మేరు లిఖిత రాత పూర్వకంగా అధికారులకు వినతిపత్రాలను సమర్పిస్తున్నారు.

- శంశాబాద్ మండలంలోని 20 పంచాయతీల్లో 1098 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఈ మేరకు వారికి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు. అయితే చాలా మంది పనులను ప్రారంభించలేదు.
- కొత్తగా ఏర్పాటు చేసిన బోటిగూడలో లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. ఇదిలా ఉండగా.. మండలంలో 484 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 132 బేసిమెంట్ దశలో ఉన్నాయి. ఇందులో 110 నిర్మాణాల్లో ప్లింత్ బీం, బెడ్‌తో బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న వివరాలను అధికారులను బిల్లుల కోసం ఆన్‌లైన్‌లో ఫొటోలతో పాటు డేటా పంపించారు.

సగం మంది రద్దు చేసుకున్నారు..

- ఆయా గ్రామాల్లో ఈ పథకం కోసం గుర్తించిన లబ్ధిదారులు సగం మంది వరకు ఇళ్లు వద్దంటూ రద్దు చేసుకున్నారు. 620 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టలేమంటూ రాసి ఇచ్చారు. ఇందుకు వివిధ కారణాలు ఉన్నాయి.
- పథకంలో నిర్దేశించిన 60 గజాల విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. సెమీ అర్బన్ ప్రాంతంగా మారిన ఆయా గ్రామాల్లో ఇల్లు విశాలంగా ఉండాలని కోరుకుంటున్నారు.
- ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం అందజేస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పనులు పూర్తి చేయడం సాధ్యపడం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. కనీసం రూ. 9 లక్షల ఖర్చు అవుతుందని, ఇంత భారం భరించలేమని చెబుతున్నారు.
- నిర్మాణానికి 4 విడతలుగా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. లబ్ధిదారులు ముందుగా పనుల కోసం సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి రావడం కూడా ఓ కారణంగా పేర్కొనవచ్చు.
- కొన్నింటిలో స్వచ్ఛందంగా లబ్ధిదారులు ఇష్టపూర్వకంగా రద్దు చేసుకోగా.. నిబంధనల మేరకు నిర్మాణాలు జరపడంలేదని గుర్తించిన ఇళ్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. కొంత మంది నిర్దేశిత స్థల విస్తీర్ణం కాకుండా ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు.
- సమయానికి డబ్బులు లేకపోవడం.. మంజూరైన నెలలోపు ఇళ్లను ప్రారంభించాలనే నిబంధనతో కూడా కొంత మంది రద్దు చేసుకున్నారు.
- మరికొంత మందికి తగు విస్తీర్ణం సొంత స్థలం లేకపోవడంతో, పాత ఇళ్లను కూల్చివేయాల్సి రావడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడంలేదు.

మోడల్ గ్రామంలో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా జనవరి నెలలో మండలానికి ఒక పంచాయతీని మోడల్‌గా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. దీంతో సుల్తాన్‌పల్లిని ఎంపిక చేసి 54 మందిని గుర్తించారు. ఇక్కడా 23 మంది వివిధ కారణాలతో ఇళ్లను రద్దు చేసుకున్నారు. ఈ పంచాయతీ పరిధిలోని సుల్తాన్‌పల్లి, కేబీ.దొడ్డి గ్రామాల్లో 29 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఓ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నారు. కొంత మందికి మొదటి దఫా ఆర్థిక సహాయం రూ. లక్ష వారి ఖాతాల్లో జమ అయింది.

కొత్త దరఖాస్తులను పరిశీలిస్తున్నాం

ఇది వరకు మంజూరైన వాటికి తోడు కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మంజూరు కోసం చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా 58 దరఖాస్తులు వచ్చాయి. వీటికి అమనుతులు రాగానే.. పనులు ప్రారంభించేలా చూస్తాం. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

– మున్నీ, ఎంపీడీఓ, శంషాబాద్

నీటి సరఫరాలో అన్యాయాన్ని సహించం

- కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు సమంగా సరఫరా చేయాలి
- బీఆర్ఎస్ మణికొండ నాయకుల డిమాండ్

మణికొండ: గేటెడ్ కమ్యూనిటీలకు ఎక్కువగా, కాలనీలకు తక్కువగా కాకుండా సమంగా నీటిని సరఫరా చేయాలని, నిబంధనల్లో లేని వాల్వ్ చార్జీలను వేస్తున్నారని, 240 గజాల లోపు గృహాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా నీటి కనెక్షన్‌లు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మణికొండలోని జలమండలి డివిజన్–18 కార్యాలయం వద్ద పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. అనంతరం జీఎం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీల వద్ద సిబ్బంది డబ్బులు తీసుకుంటూ ఎంత పడితే అంత సమయం నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. అదే కాలనీలకు వచ్చే సరికి గతంలో రోజు విడిచి రోజు గంటన్నర సమయం మాత్రమే సరఫరా చేయగా ప్రస్తుతం దాన్ని గంటకు తగ్గించారన్నారు. దాంతో ప్రజలు నీరు సరిపోక వేలాది రూపాయలు వ్యయం చేస్తూ ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలకాపూర్ టౌన్‌షిప్ స్పోర్ట్స్ పార్క్‌లో ప్రారంభించిన రిజర్వాయర్‌ను వినియోగంలోకి తీసుకొస్తే ప్రజలకు మరింత సమయం నీటిని సరఫరా చేయవచ్చన్నారు. సామాన్య ప్రజల వద్ద నీటి బిల్లులతో పాటు వాల్వ్ చార్జీల పేరుతో వేలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు. ఇకనైనా జలమండలి అధికారులు తమ పనితీరు మార్చుకుని ప్రజలకు సరిపడే స్థాయిలో నీటిని సరఫరా చేయాలని, అదనపు చార్జీలను తొలగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, ప్రచార కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌రావు, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, శ్రీధర్, ఆరీఫ్ మహమ్మద్, భానుచందర్, సుమ నళిని, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జలమండలి కార్యాలయం వద్ద నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

'నివాసాల మధ్య మురుగునీటి శుద్ధి ప్లాంట్ వద్దు'



వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలోని విగ్నేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ, కేకే–2నగర్, దత్తాత్రేయ కాలనీ, రంగారెడ్డి కాలనీల మధ్య ఎస్‌టీపీ (సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్)ను ఏర్పాటు చేయకూడదని హైదరాబాద్ జలమండలి కార్యాలయంలో అధికారులను కలిసి కాలనీల వాసులు వినతిపత్రం అందజేశారు. దాదాపు పది కాలనీల మధ్యలో ఇలాంటి మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యంతోపాటు వాతావరణ, శబ్ధ కాలుష్యం ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలేత్తే అవకాశం ఉంటుందన్నారు. ఎస్‌టీపీలను కాలనీల మధ్యలో నెలకొల్పడం వల్ల కాలుష్యంతో పాటు స్థానికులు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ఇటీవల కలిసి సమస్యను వివరించామన్నారు. అలాగే హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు కార్యాలయంలో అధికారులతో చర్చించామని... వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రెవెన్యూ శాఖ వారితో చర్చించి ఇతర ప్రాంతంలో ఎస్‌టీపీ నిర్మించడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

రాజేంద్రనగర్ అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ. 71 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పనుల పురోగతిని, నాణ్యతను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీసీ రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే మైలార్‌దేవ్‌పల్లి నుంచి శాస్త్రీపురం, వట్టెపల్లి వెళ్లే ప్రజలకు ప్రయాణ దూరం గణనీయంగా తగ్గుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం త్వరలో తీరనుందన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు సులువైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందిచడమే తమ లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నదన్నారు. పనులను వేగవంతంగా, నాణ్యతతో చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్, డీఈ కార్తీక్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఈఈ నరేందర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం సీజ్



రాజేంద్రనగర్: నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణానికి నోటీసులు అందించినా పట్టించుకోకపోవడంతో జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. ఉప్పర్‌పల్లి జన చైతన్య కాలనీ విల్లా నంబర్ 36కు చెందిన యజమాని అనుమతులు లేకుండా మూడో అంతస్తుతో పాటు పెంట్‌హౌస్ నిర్మిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారునికి నోటీసులు అందించారు. నోటీసులు అందుకున్న స్పందించకపోవడంతో పాటు నిర్మాణాన్ని అలాగే కొనసాగిస్తుండటంతో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్‌ల ఆధ్వర్యంలో బుధవారం మూడో అంతస్తుతో పాటు పెంట్‌హౌస్‌ను సీజ్ చేశారు. నోటీసులకు స్పందించకపోతే సీజ్ లేదా కూల్చివేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న విద్యార్థి నాయకులు

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో 2025–26వ విద్యా సంవత్సరానికిగాను కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కల్నల్ కుల్దీప్ బాదు పాల్గొని విద్యార్థులకు బ్యాడ్జెస్‌ను ప్రదానం చేశారు. ఎస్పీఎల్‌గా ఎన్నికైన విద్యార్థితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నాయకత్వ లక్షణాల వృద్ధికి ఉపకరిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను ఏవీ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఆర్మీలో చేరాలని... దేశానికి సేవ చేయాలని విద్యార్థులకు సూచించారు. మెహిదీపట్నం డీన్ ప్రియ మనీష్, పాఠశాల ప్రిన్సిపాల్ సుధ, అకడమిక్ ఇన్‌చార్జి పరమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరాగిగూడ-నార్సింగి రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: బైరాగిగూడ–నార్సింగి రహదారి ఆర్మీ పరిధిలో ఉన్న నేపథ్యంలో ఉత్పన్నం అవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ రోడ్డు సమస్యను బైరాగిగూడ కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన బుధవారం కాలనీవాసులతో కలిసి రహదారిని పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో చర్చించి సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేకేనగర్, విగ్నేశ్వర కాలనీ, దత్తాత్రేయ కాలనీ, రంగారెడ్డి కాలనీ మధ్యలో ఉన్న ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు ఆపాలని ఆల్ కాలనీస్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ అధ్యక్షుడు కొండె మహేష్‌యాదవ్, బీజేపీ సీనియర్ నేతలు మహాలింగంగౌడ్, పి.ఎస్.మల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, శేఖర్‌ముదిరాజ్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, పవన్‌సాయి, అర్జున్, శివలీల, భాగ్య, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించాలి

రాజేంద్రనగర్: బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు గౌతమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మాజీ మంత్రి కేటీఆర్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లో గౌతమ్ మాట్లాడుతూ... విద్యార్థి విభాగాన్ని నియోజకవర్గం పరిధిలో మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ సూచించారన్నారు. విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని ఆదేశించారని వెల్లడించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులతో కలిసి ముందుకు వెళ్లాలని ఆదేశించారన్నారు.

ఆటోల్లో ప్రయాణికులకు భద్రత కల్పించాలి

మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి



నార్సింగిలో ఆటోలకు స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏసీపీ

మణికొండ: ప్రయాణికులకు ఆటో డ్రైవర్‌లు పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని, వారికి ఎలాంటి ఇబ్బంది కలిగినా ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు తప్పవని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నడుపుతున్న 410 ఆటోలకు బుధవారం మై ఆటో ఈజ్ సేఫ్ అనే స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల పూర్తి వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ... కొందరు ఆటో డ్రైవర్ల అనుచిత ప్రవర్తన కారణంగా అందరికీ చెడ్డ పేరు వస్తున్నదన్నారు. ఎలాంటి తప్పుడు పనులు, నేరాలు చేసినా వెంటనే సదరు ఆటోతో పాటు డ్రైవర్‌పై రాబోయే రోజుల్లో చర్యలు తప్పవని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. ప్రయాణికులను భద్రంగా, క్షేమంగా గమ్య స్థానాలను చేర్చి హైదరాబాద్ నగరంతో పాటు గండిపేట మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ రాజేశ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి
- పరిశుభ్రతలను పాటిస్తేనే వ్యాధులకు చెక్
- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలోని చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరుచేసి చెత్త బండ్లలో వేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం 22వ డివిజన్‌లోని యాదవమిత్ర నగర్, భారతీనగర్ కాలనీలలో పారిశుద్ధ్య విభాగంలో భాగంగా తడి, పొడి చెత్త చెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 21వ డివిజన్‌లోని ద్వారకానగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ పక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడమనేది వ్యర్థాల నిర్వహణలో ముఖ్యమైన భాగం తడి చెత్త అంటే ఆహారం, కూరగాయలు, ఆకులు, తొక్కలు వ్యర్థాలు వంటి కుళ్లిపోయే వ్యర్థాలు తెలిపారు. పొడి చెత్త అంటే కాగితం గ్లాసులు, ప్లాస్టిక్, లోహం వంటివి అని వివరించారు. తడి చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి మొక్కలకు నర్సరీలో ఉపయోగిస్తాం. పొడిచెత్తను రిసైక్లింగ్ ప్రక్రియ ద్వారా ఉపయోగించుకోవచ్చని కమిషన్ పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర స్పష్టం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించవని ఆయన వివరించారు.

కాలనీలలో పశువుల పాకలు..

నివాస ప్రాంతాలలో పశువుల పాకలు ఉండటం వలన అపరిశుభ్రత లోపించి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, పశువుల పాకలలోని వ్యర్థాలు రోడ్డుపైకి రావడంతో దుర్వాసనతో కాలనీలలో నివసించే ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తుందని కమిషనర్‌కు కాలనీ వాసులు తెలియజేశారు. దీంతో పశువుల పాకను పరిశీలించిన ఆయన ప్రజారోగ్యానికి హాని కలుగకుండా, పశువుల పాకలో వ్యర్థాలు పేరుకుపోకుండా, రోడ్డుపైకి వ్యర్థాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాటి యజమానులకు సూచించారు. జాగ్రత్తలో తీసుకోకుంటే తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

- డీఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, కాలనీ నేతలు నెహ్రూ, శ్రీనివాస్‌గౌడ్, శేఖరయ్య, రామరావు,అంతిరెడ్డి, విఠల్‌రెడ్డి, విజయ్‌గౌడ్, రమాదేవి, చంద్రకళ, నిర్మల, నాగలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సిగాచి' ప్రమాద బాధితులకు న్యాయం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్

మైలార్‌దేవ్‌పల్లి: సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కాటేదాన్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ మాట్లాడుతూ... బతుకుదెరువు కోసం పలు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్నారన్నారు. వలస కార్మికుల చట్టం–1979ను అమలు చేయకుండా కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ వారితో వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. ఇటీవలి జరిగిన ప్రమాదంలో సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మరణించిన, గాయపడ్డ కార్మికులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీ నేటికీ అమలు కాలేదన్నారు. వెంటనే వారి కుటుంబాలను ఆదుకోవాలని, ఆ పరిశ్రమ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబంలో ప్రభుత్వం ఒకరికి ఉద్యోగం, వసతి కల్పించాలని, ఆ ఘటనలో పరిశ్రమలో గాయపడిన కార్మికులకు రూ. 50 లక్షలు ఇవ్వాలని, ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.కవిత, జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, డి.జగదీష్, డి.కిషన్, నర్సిరెడ్డి, అల్లి దేవేందర్, జిల్లా సహాయ కార్యదర్శి వీరయ్య, జిల్లా నాయకులు జి.ఎం.గట్టయ్య, పి.సి.కె.భాస్కర్, తిరుమలేష్, ప్రవీణ్, సచిన్, టి.వెంకటేష్‌గౌడ్, ఎస్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కాటేదాన్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు